సాక్షి ప్రకాశం

ఆదివారం । 11 । మే । 2025



మాయమై పోతున్నడమ్మా.. మనిషన్న వాడు

మానవ సంబంధాలు కనుమరుగవుతున్నాయి. కంభంలో గత నాలుగు నెలల్లో నాలుగు కుటుంబ హత్యలు జరిగాయి.

- 10లో..



కనిగిరిలో ఒకే రోజు నలుగురు మృతి

కనిగిరిలో శుక్రవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు, ఆత్మహత్య చేసుకుని మరో ఇద్దరు మృతిచెందారు.

- 10లో..

గరిష్టం/కనిష్టం
38 /29

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఐజీ ముందుకు వీరయ్య హత్య కేసు

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో సంచలనం రేకెత్తించిన టీడీపీ నాయకుడు, నాగులుప్పలపాడు మాజీ ఎంపీపీ హత్య కేసు దాదాపుగా ముగింపు దశకు చేరుకుంది. గత నెల 22వ తేదీ రాత్రి వీరయ్య చౌదరి దారుణ హత్యకు గురయ్యారు. అప్పటి నుంచి శనివారం వరకు జరిగిన పరిణామాలను ఐజీ సర్వ శ్రేష్ఠ త్రిపాఠీకి వివరించేందుకు ఎస్పీ ఏఆర్ దామోదర్, విచారణాధికారిగా వ్యవహరిస్తున్న ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాస్ రావు శనివారం గుంటూరు వెళ్లినట్లు సమాచారం. హతుడు వీరయ్య చౌదరి, ప్రధాన సూత్రధారులంతా టీడీపీ నాయకులు కావడంతో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో కేసును ఫైనల్ చేయాలని భావిస్తున్న పోలీసులు చివరిగా ఐజీని కలిసినట్లు తెలుస్తోంది.

250 మంది అనుమానితుల విచారణ..

వీరయ్య చౌదరి హత్య జరిగి శనివారం నాటికి 20 రోజులు పూర్తయ్యాయి. ఎస్పీ ఏఆర్ దామోదర్ పర్యవేక్షణలో ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, సీఐల బృందం ముమ్మరంగా విచారణ చేపట్టింది. బియ్యం, మద్యం, రియల్ మాఫియాలతో సంబంధం ఉన్న దాదాపుగా 250 మంది అనుమానితులను పోలీసులు విచారించారు. నిందితులు ఉపయోగించిన రెండు వాహనాలను స్వాధీనం చేసుకున్న తర్వాత లభించిన కీలకమైన ఆధారాలతో హత్య కేసు కీలకమైన మలుపు తిరిగింది. వీరయ్య చౌదరి హత్యకు ఆయన స్వగ్రామమైన నాగులప్పలపాడు మండలం అమ్మనబ్రోలులోనే పథక రచన జరిగిందని పోలీసులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అంతేకాకుండా ఆయన సొంత పార్టీకి చెందిన నాయకులే ముఖ్య సూత్రధారులుగా నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. హత్యలో ప్రధాన పాత్ర పోషించినట్లు భావిస్తున్న కొప్పోలు వ్యక్తితో పాటుగా నెల్లూరుకు చెందిన ఇద్దరు నిందితులను కూడా అదుపులోకి తీసుకున్నారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు సమాచారం. హత్యలో ప్రధాన పాత్ర పోషించినట్లు పోలీసులు అనుమానిస్తున్న మరో ముఖ్య పాత్రధారి దేశం సరిహద్దులు దాటేసినట్టు ప్రచారం జరుగుతోంది.

గోకులం బిల్లు మని!

గోకులం, మినీ గోకులం పథకాల కింద పశువుల షెడ్లు నిర్మించుకున్న పాడి రైతులు అల్లాడుతున్నారు. ప్రభుత్వం రాయితీ ఇస్తోందని ఆశపడి ముందుకొచ్చిన వారి ఆశలు అడియాసలుగా మారుతున్నాయి. ఒక్కో షెడ్డు నిర్మాణానికి రూ.లక్షల వరకు ఖర్చు చేసి ఇప్పటికీ బిల్లులు అందలేదు. ఎప్పటికి వస్తాయనేది తెలియడం లేదు. రూ.లక్షలు అప్పులు చేసి నిర్మించామని, ఇప్పటి వరకూ నగదు ఇవ్వకపోవడంతో అప్పులే మిగిలాయని రైతులు వాపోతున్నారు. జిల్లాలో 1190 గోకులం షెడ్లు మంజూరు కాగా 799 షెడ్లను రైతులు నిర్మించారు. షెడ్లు నిర్మించుకుని ఐదు నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు రావాల్సిన రూ.16.54 కోట్లు ఇంకా విడుదల చేయలేదు.



పొన్నలూరు మండలం చెన్నిపాడులో నిధులు మంజూరు కాక అసంపూర్తిగా ఉన్న షెడ్

- షెడ్లు నిర్మించినా నిధులు రాక రైతుల నిరాశ
- ఐదు నెలలుగా నిధుల కోసం నిరీక్షణ
- జిల్లాలో 1190 మంది రైతులకు గోకులం షెడ్లు మంజూరు
- అప్పులు తెచ్చి 799 షెడ్లు నిర్మించిన రైతులు
- జిల్లాలో లబ్ధిదారులకు రావాల్సిన నిధులు రూ.16.54 కోట్లు
- కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతులు

పొన్నలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల తరువాత పాడిరైతుల అభివృద్ధికి మినీ గోకులం షెడ్లు నిర్మిస్తామని ముందుకు వచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో పశుపోషణ పెంచి పశుపోషకుల జీవన శైలి మెరుగుపర్చాలన్నదే గోకులం షెడ్ల ప్రధాన లక్ష్యం. అయితే ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించే గోకులం షెడ్లకు.. పశువుల షెడ్లకు 90 శాతం రాయితీ, గొర్రెలు, మేకలు, కోళ్లకు 70 శాతం రాయితీని చెల్లిస్తారు. ప్రభుత్వం ఉపాధి హామీ పథకం ద్వారా అందించే రూ.2.30 లక్షల్లో రూ.23 వేలు లబ్ధిదారుని వాటా ఉండగా మిగిలిన రూ.2.07 లక్షలు ప్రభుత్వం చెల్లించాలి. ఇంత వరకు బాగానే ఉన్నా గ్రామాల్లో రైతులు నిర్మించిన గోకులం షెడ్లకు ఇంత వరకు బిల్లులు చెల్లించకపోవడంతో ఐదు నెలలుగా నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో మొత్తం 1190 గోకులం షెడ్లు మంజూరు కాగా ఇందులో 799 షెడ్లను పూర్తి స్థాయిలో నిర్మించారు. మిగిలిన 391 వివిధ దశల్లో ఉన్నాయి. అయితే పూర్తి స్థాయిలో నిర్మించిన 799 షెడ్లకు సుమారుగా రూ.16.54 కోట్ల నిధులు మంజూరు చేయాలి. అలాగే కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో మొత్తం 268 గోకులం షెడ్లు మంజూరు కాగా ఇందులో 172 షెడ్లను పూర్తిగా నిర్మించగా మిగిలిన 96 వివిధ దశలో ఉన్నాయి. కొన్ని అసలు మొదలు పెట్టలేదు. అయితే పూర్తి స్థాయిలో నిర్మించిన 172 షెడ్లకు సుమారుగా రూ.3.54 కోట్ల నిధులు లబ్ధిదారులకు మంజూరు చేయాల్సి ఉండగా ఇప్పటికీ ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు.



టంగుటూరులో నిర్మించిన గోకులం షెడ్

రైతులపై చిన్నచూపు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పది నెలలుగా రాష్ట్రంలోని రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. పండించిన పంటలకు గిట్టుబాటు, మద్దతు ధరలేకపోవడం, ధర్నాలు, ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పందన మాత్రం శూన్యం. ఎన్నికల సమయంలో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి రైతులను ఆదుకుంటామని ఊకదంపుడు ఉపన్యాసాలు చేసిన సీఎం చంద్రబాబు ప్రస్తుతం చూపిస్తున్న ద్వంద్వ వైఖరితో రైతుల పట్ల ఎలాంటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుంది. అలాగే గ్రామాల్లో పశుపోషకులు గోకులం షెడ్ల పనులు ప్రారంభించిన తరువాత ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాకపోవడంతో మధ్యలో నిర్మాణ పనులను వదిలేయలేక రైతులు అప్పులు చేసి షెడ్లను పూర్తి స్థాయిలో నిర్మించారు. మరికొందరు రైతులు గోకులం షెడ్ల నిర్మాణ పనులు అసలు ప్రారంభించలేదు. మొత్తంగా ఐదు నెలలుగా నిధులు మంజూరు చేయకపోవడం వలన గోకులం షెడ్లు లబ్ధిదారులు ఆర్థికంగా అప్పులు చేసి ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలోనే నిధులు మంజూరవుతాయి

జిల్లాలో గోకులం షెడ్లు నిర్మించిన పశుపోషకులకు ఇంకా బిల్లులు మంజూరు కాలేదు. ఉపాధి హామీ పథకం ద్వారా సుమారుగా 799 మంది లబ్ధిదారులు పూర్తి స్థాయిలో గోకులం షెడ్లు నిర్మించారు. ఇప్పటికే లబ్ధిదారులకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందించాం. నిధులు మంజూరు కాకపోవడంతో వెంటనే బిల్లులు చెల్లించలేకపోయాం. వచ్చే పది రోజుల్లో సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారులకు బిల్లులు అందిస్తాం.

– జోసఫ్ కుమార్, డ్వామా పీడీ, ఒంగోలు

అప్పులు మిగిలాయి...

చిన్న, సన్నకారు రైతులు సొంతంగా రూ.లక్షలు ఖర్చు చేసే పరిస్థితి లేకనే.. ప్రభుత్వం రాయితీ ఇస్తుందని ముందుకొచ్చారు. వాస్తవంగా గోకులం షెడ్ నిర్మాణ దశలో ఉన్నప్పుడు రెండు దశల్లో నగదు చెల్లించాలి. బేస్‌మెంట్ దశలో రూ.20 వేలు, ఆ తరువాత షెడ్డు పూర్తి స్థాయిలో నిర్మించాక మిగిలిన నగదు ఇవ్వాలి. గోకులం షెడ్ల నిర్మాణం ప్రారంభించి ఐదు నెలలు కావస్తున్నా ఇంత వరకు కూటమి ప్రభుత్వం ఒక్క పైసా కూడా చెల్లించలేదు. అలాగే రైతులకు ఉపాధి హామీ మస్టర్ల రూపంలో చెల్లించాల్సిన నగదు కూడా నేటికీ జమకాలేదు. దీంతో పాటు ప్రభుత్వం నుంచి గోకులం షెడ్ల నిర్మాణానికి సంబంధించి అంచనాల తయారీపై స్పష్టత రాలేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అలాగే షెడ్ నిర్మాణంలో భాగంగా రైతులు 20 శాతం జీఎస్టీ చెల్లించాలని అధికారులు చెబుతూ కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు.

అంకమ్మ తల్లి కొలుపులకు రాజకీయ గ్రహణం

- గతంలో పెత్తనం చేసిన వారు అమ్మవారి సొమ్ము స్వాహా
- దొంగతనం కప్పిపుచ్చుకునేందుకు వర్గపోరును రెచ్చగొట్టిన పెత్తందారులు
- కోర్టు ఆదేశాలను ఖాతరు చేయని పోలీసులు
- కమిటీ సభ్యులను ఆలయంలోకి రాకుండా పోలీసులతో అడ్డుకున్న అధికార పార్టీ వర్గీయులు
- దాన్ని నిరసిస్తూ పురుగుల మందు తాగిన నలుగురు కమిటీ సభ్యులు
- పోలీసుల దాష్టీకానికి వ్యతిరేకంగా రాస్తారోకో



పోలీసుల వైఖరికి నిరసన తెలియజేస్తున్న స్థానిక భక్తులు



ఆలయ ప్రాంగణంలో పురుగుల మందు తాగిన వ్యక్తులు

నాగులుప్పలపాడు: వరాలు అందించే అంకమ్మ తల్లి కొలుపులకు ఈ సారి రాజకీయ గ్రహణం పట్టింది. అనాదిగా అమ్మవారి ఆస్తులపై పెత్తనం చేసిన ఊరి పెద్ద వారసుడు అమ్మవారి సొమ్ములను, ఆస్తులను అన్యాక్రాంతం చేయడంతో ఈ సారి సొంతంగానే కొలుపులు నిర్వహించుకుందామనుకున్న ఆలయ కమిటీ ఆలోచనలకు ఓర్వలేని పెత్తందారులు అమ్మవారి కొలుపులు నిర్వహించే కుటుంబ సభ్యులలోనే విభేదాలు సృష్టించి దానికి రాజకీయ రంగు పులిమి చివరకు కొలుపులు ఆగేలా చేసి గ్రామంలో అలజడికి కారణమయ్యారు. వివరాల్లోకి వెళ్తే నాగులుప్పలపాడు గ్రామంలో 6 దశాబ్దాలకు పైగా వడ్డెర రాజుల కులస్తులు తమ కులదైవం అంకమ్మ తల్లికి ప్రతి మూడేళ్లకు ఒకసారి అత్యంత వైభవంగా కొలుపులు నిర్వహిస్తారు. వడ్డెరలు అమ్మవారికి తయారు చేయించిన బంగారు వస్తువులు, నగదును గ్రామంలోనే పేరు మోసిన ఓ పెత్తందారి ఆధీనంలో ఉంచుతూ కొలుపులు నిర్వహించుకుంటున్నారు. ఆ పెద్ద మనిషి కూడా కొలుపులు నిర్వహించుకునే వారికి అండదండగా ఉంటూ వచ్చాడు. అయితే ఆయన తరువాత అమ్మవారి వస్తువులు, నగదు బాధ్యత చేపట్టిన పెత్తందారి కుమారుడు తన వక్రబుద్ధితో రెండేళ్ల క్రితం అమ్మవారి బంగారు ఆభరణాలు దొంగతనం చేశాడన్న అభియోగంతో పోలీస్‌స్టేషన్ లో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి వడ్డెర కులస్తులకు అమ్మవారి బంగారు ఆభరణాల వివరాలు చెప్పని పెత్తందారి కుమారుడు ఏడాది క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. అయితే అంకమ్మ తల్లి ఆలయంలో పెత్తందారుల పెత్తనం వద్దని, అమ్మవారిని తమ కుల దైవంగా భావించే గుంజి అనే ఇంటి పేరు గల కుటుంబ సభ్యులు కొత్తగా కమిటీ ఏర్పాటు చేసుకొని దానిని రిజిస్టర్ చేయించి ఆలయ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది అమ్మవారికి అత్యంత వైభవంగా కొలుపులు నిర్వహించాలని నిర్ణయించిన గుంజి వారసులు కొలుపులకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకున్నారు. గ్రామంలోని పెత్తందారుల ప్రమేయం లేకుండా చేసుకుంటున్న ఈ కొలుపులకు ఓర్వలేని కొంత మంది పెద్ద మనుషులు అధికార పార్టీ అండదండలతో గుంజి వారి కుటుంబంలోనే కొద్ది మందిని రెచ్చగొట్టి కొలుపులు జరపకుండా చేయాలని కుట్ర పన్నారు. అనుకున్నదే తడవుగా అధికార పార్టీ నాయకుల చేత కొలుపులు నిర్వహించే వారిపై తీవ్రమైన ఒత్తిడి తేవడంతో పాటు వారికి ప్రతిపక్ష పార్టీ వారంటూ పేరు అంటగట్టి పూర్తి స్థాయి అధికార దర్పాన్ని ప్రదర్శించి వారిపై తీవ్రమైన ఒత్తిడి తేవడంతో ఆలయ కమిటీ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. వారి వాదనలకు సమ్మతించిన హైకోర్టు ఈ నెల 10వ తేదీ నుంచి 17వ తేది వరకు కొలుపులు నిర్వహించుకోవడానికి అనుమతి ఇచ్చింది. ఈ క్రమంలో కోర్టు ఉత్తర్వులు అందజేయడానికి వెళ్లిన కమిటీ సభ్యులపై అందరూ కలిసి కొలుపులు నిర్వహించుకోవాలని జిల్లా స్థాయి అధికారులు, రాజకీయ పార్టీ నాయకులు తీవ్రమైన ఒత్తిడి తెచ్చారు. గతంలో అమ్మవారి సొమ్ములు అన్యాక్రాంతం చేసిన వారిని కమిటీలోకి తీసుకోకుండా కొలుపులు చేసుకోవడానికి అంగీకరిస్తామని కమిటీ సభ్యులు తెలియజేశారు. ఈ క్రమంలో గ్రామంలో ఇప్పటికే ఉద్రిక్త వాతావరణం నెలకొని ఉండటంతో అనుకున్నట్లే శనివారం ఉదయం కోర్టు అనుమతి కాగితాలు పోలీసులకు అందజేసి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్న కమిటీ సభ్యులపై అప్పటికే అక్కడ వేచిఉన్న మరొక వర్గం వారు ఆలయంలోకి రాకుండా అడ్డుకోవడంతో ఇరు వర్గాల వారు ఘర్షణ ఏర్పడి ఇరు పక్షాల వారికి గాయాలయ్యాయి. అధికార పార్టీ నాయకుల అండదండలతో పోలీసులు తమ పట్ల నిరంకుశంగా వ్యవహరించారంటూ ఆలయ కమిటీ లోని నలుగురు సభ్యులు పురుగుల మందు తాగడంతో వారిని అత్యవసరంగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలో రోడ్డు పై బైఠాయించి రాస్తారోకో చేసిన ఆలయ కమిటీ వారిని కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకొని ఆలయం వద్ద పూర్తి స్థాయి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆందోళనకారులను అదుపు చేస్తున్న పోలీసులు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గుంజి అంకమ్మ

సంక్షోభంలో వ్యవసాయ రంగం


- ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెని విజయవంతం చేయాలని రైతుసంఘాల పిలుపు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చుండూరు రంగారావు

ఒంగోలు టౌన్: వ్యవసాయ రంగం సంక్షోభంలో పడిపోవడంతో రైతులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, ప్రభుత్వ అసమర్థ విధానాలతో ఈ ఏడాది అన్నీ రకాల పంటల ధరలు పడిపోవడంతో అన్నదాతలు అప్పులపాలయ్యారని సంయుక్త కిసాన్ రైతు మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు చెప్పారు. దశాబ్దాల తరబడి అపరిష్కృతంగా ఉన్న రైతు సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20వ తేదీ చేపట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక నారాయణ స్వామి భవనంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చుండూరి మాట్లాడుతూ ధాన్యాన్ని రూ.400 తక్కువ ధరలకు అమ్ముకుంటున్నారని, గతేడాది రూ.18 వేలకు విక్రయించిన మిర్చిని ఈ ఏడాది రూ.9 వేలకు అమ్ముకోవాల్సి వస్తుందని తెలిపారు. పత్తిని 2 వేలకు తక్కువగా అమ్ముతుండగా బర్లీ పొగాకును కొనేనాథుడే లేడన్నారు. అపరాలు, రొయ్యలు, జీడి పిక్కలు, కోకో గింజల ధరలు కంపెనీల దయా దాక్షిణ్యాల మీద ఆధార పడి ఉన్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధరల విషయంలో కలుగజేసుకోకపోవడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధిని రద్దు చేయడం దారుణమని మండిపడ్డారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పిస్తామని రాతపూర్వకంగా ఇచ్చిన హామీని అమలు చేయకుండా రైతులను దగా చేసిందని విమర్శించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టే సమయం ఆసన్నమైందన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఇస్తానన్న రూ.20 వేలను వెంటనే అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘాల నాయకులు భీమవరపు సుబ్బారావు, సుధీర్, ఆర్.మోహన్, కె.నాంచార్లు తదితరులు పాల్గొన్నారు.

మురళీ నాయక్ భరతమాత ముద్దు బిడ్డ




మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్


యర్రగొండపాలెం: యుద్ధంలో దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్‌కు శనివారం ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేశారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం, గోరంట్ల మండలంలోని కల్లి తండాకు చెందిన మురళీ నాయక్ పాకిస్థాన్ బోర్డర్ వద్ద జరిగిన కాల్పుల్లో మృతి చెందిన విషయం విదితమే. మురళీ నాయక్ భరతమాత ముద్దుబిడ్డ అని ఎమ్మెల్యే అభివర్ణించారు. ఆయన కుటుంబానికి యావత్ భారతదేశం అండగా ఉంటుందని అన్నారు. మురళీ నాయక్ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి వ్యక్త పరిచారు. ఆర్మీ జవాన్‌కు నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ఓబులరెడ్డి, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, ఆవుల కోటివీరారెడ్డి, ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, వివిధ విభాగాల నాయకులు భూమిరెడ్డి సుబ్బారెడ్డి, సయ్యద్ జబీవుల్లా, దొగిపర్తి సంతోష్‌కుమార్, పి.రాములు నాయక్, సయ్యద్ షాబీర్‌బాష, షేక్.బుజ్జి, వై.వెంకటేశ్వర రెడ్డి, ఆర్.వెంకటేశ్వర్లు నాయక్, బ్రహ్మారెడ్డి, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

నీటితొట్లలో నాణ్యత డొల్ల

- నాసిరకం కంకర, వాడుకకు పనికిరాని ఇటుకలతో తొట్లు
- తొట్ల నిర్మాణం పశువుల కోసమా.. బిల్లుల కోసమా
- అధికార పార్టీలోనే అసంతృప్తులు



క్యూరింగ్ చేయని తొట్టి





తొట్ల నిర్మాణానికి వాడుతున్న నాసిరకం కంకర, ఇటుక

కొనకనమిట్ల: వేసవిలో మూగ జీవాలు పొలాలకు మేత కోసం వెళ్లినప్పుడు గుక్కెడు నీరు దొరకటం గగనంగా ఉంటుంది. మూగ జీవాలను తోలుకెళ్లే కాపరులు వాటికి నీటిని అందించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇటీవల పశువులకు ఉపయోగపడేలా నీటి తొట్లు ఏర్పాటుకు గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా నిధులు కేటాయించింది. ఒక్కో తొట్టి నిర్మాణానికి రూ.30 వేలు మంజూరు చేసింది. అయితే నీటి తొట్ల నిర్మాణాన్ని కూటమి నేతలకు అప్పగించింది. వారికి తొట్ల నిర్మాణం వరంగా మారింది. తూతూ మంత్రంగా నిర్మించి నిధులు బొక్కేస్తున్నారు. అయితే నాసిరకం ఇసుక, కంకర, ఇటుక వాడుతుండటంతో తొట్లు తొందరగా లీకయ్యే అవకాశం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. కొనకనమిట్ల మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో 13 గ్రామాల్లో 48 నీటి తొట్లు ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేశారు. గొట్లగట్టులో 10, సిద్దవరం 6, ఇరసలగుండం 4, వింజవర్తిపాడు 3, రేగుమానిపల్లి 3, గరిమినపెంట 3, కాట్రగుంట 2, తువ్వపాడు 2తో పాటు పలు గ్రామాల్లో నీటి తొట్లు అవసరమని భావించి నిధులు కేటాయించారు. అయితే 48 నీటి తొట్లు నిర్మాణం చేపట్టేందుకు మండలంలోని ఓ కూటమి నేతకు నియోజకవర్గ నేత కాంట్రాక్ట్ అప్పజెప్పినట్లు సమాచారం. ఇప్పటికే కాంట్రాక్ట్ దక్కించుకున్న నేత నాసిరకం మెటీరియల్ వాడి చకచకా 40 తొట్లు పూర్తి చేశాడు. ఇంకా 8 తొట్లు పూర్తి కాలేదు. పూర్తి చేసనవి కూడా సక్రమంగా క్యూరింగ్ చేయలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే తొట్లు మంజూరైన గ్రామాల్లో స్థానిక కూటమి నేతలు ఉండగా వారిని కాదని ఒక్క నాయకుడికే 48 తొట్లు నిర్మాణం చేపట్టేలా కాంట్రాక్ట్ ఇవ్వటంతో స్థానిక నేతలు అసంతృప్తిగా ఉన్నారు. కొన్ని గ్రామాల్లో తొట్ల నిర్మాణాన్ని అధికార పార్టీ నేతలే అడ్డుకుంటున్నట్లు సమాచారం. అదికూడా నాసిరకంగా తొట్లు నిర్మాణం చేపట్టడంపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. అధికార పార్టీలోనే తొట్ల నిర్మాణంపై అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే వేసవి కాలం సగం పూర్తవుతోంది. అన్నీ పూర్తి చేసి నీటి వసతి కల్పించే సరికి పుణ్యకాలం కాస్త అయిపోతుందని పశుపోషకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేవుడు దయ వలన ఇటీవల అక్కడక్కడా వర్షాలు పడి కుంటల్లో కాస్తో కూస్తో నీరు ఉండటంతో మూగ జీవాలకు కొంత వరకు ఉపయోగంగా ఉండటంతో కాపరులు ఊపిరి పోసుకున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తొట్ల నిర్మాణం సక్రమంగా చేపట్టేలా చర్యలు తీసుకుని నీటి వసతి కల్పిస్తే రాబోవు రోజుల్లోనైనా పశువులకు ఉపయోగంగా ఉంటుంది.




కుంటలో నీటి కోసం వచ్చిన జీవాలు

క్లుప్తంగా

నేడు బూచేపల్లి సుబ్బారెడ్డి వర్ధంతి

దర్శి (కురిచేడు): దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి సుబ్బారెడ్డి 6వ వర్ధంతి ఆదివారం చీమకుర్తిలోని కమలాకర్‌రెడ్డి పార్కు బూచేపల్లి సుబ్బారెడ్డి ఘాట్ వద్ద నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి నియోజకవర్గ శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వారి కుటుంబ సభ్యులు హాజరై నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. దర్శి నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని ఆయన కోరారు.

పిడుగుపాటుకు వ్యక్తి బలి


పెద్ద గాలెయ్య మృతదేహం

పెద్దారవీడు: మండలంలోని పోతంపల్లి గ్రామానికి చెందిన వలపర్ల పెద్దగాలెయ్య పిడుగుపడి శనివారం సాయంత్రం మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. వలపర్ల పెద్దగాలెయ్యకు చెందిన గేదె సాయంత్రం వరకు ఇంటికి రాకపోవడంతో పాలాల్లో వెతికేందుకు బావమరిది బెజవాడ రామయ్యను తోడుగా తీసుకెళ్లాడు. కర్రోల గ్రామం పొలాల్లో కొన్ని గేదెలు ఉండటంతో అక్కడైనా తమ గేదె ఉందోమోనని తొందరగా వెళ్తున్నారు. ఆయన బావమరిది వెనుక నిదానంగా వెళ్తున్నాడు. ఆ ప్రాంతంలో ఈదురు గాలులు, ఉరుములు మెరుపులు, చిన్నపాటి వర్షం కురుస్తోంది. గేదెను వెతుకుతున్న సమయంలో ఒక్కసారిగా ఉరుములు మెరుపులు రావడంతో పిడుగుపడి వలపర్ల పెద్దగాలెయ్య (50) అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు బావమరిది ఫోన్ చేసి ఎక్కడ ఉన్నావని ప్రశ్నించే ప్రయత్నం చేయగా సమాధానం లేదు. రామయ్య అక్కడికి వెళ్లి చూడగా పెద్ద గాలెయ్య నిర్జీవంగా పడి ఉన్నాడు. వెంటనే ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య

- మృతుడిది కర్ణాటక రాష్ట్రంగా అనుమానం


గుర్తు తెలియని మృతదేహం


మృతుడి చేతిపై ఉన్న బొమ్మ

పెద్దారవీడు: మండల పరిధిలోని పోతంపల్లి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న బ్రిడ్జి కింద గుర్తు తెలియని యువకుడు శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. హనుమాన్ జంక్షన్ కుంట నుంచి దోర్నాల వరకు జాతీయ రహదారిలో నూతనంగా తారు రోడ్డు నిర్మాణంలో భాగంగా పోతంపల్లి–రాజంపల్లి గ్రామాల మధ్యలో బ్రిడ్జి నిర్మాణం జరుగుతోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి ఇనుప చువ్వలకు తన చొక్కా కట్టుకొని ఊరేసుకున్నాడు. మృతుడికి సుమారు 35 ఏళ్లు ఉండొచ్చని, ఒంటిపై బ్లూ కలర్ బార్డర్ కలిగిన ఎర్ర రంగు బనియన్, లైట్ షేడ్ బ్లూ కలర్ జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడు. ప్యాంటు జేబులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన కెఏ 4420160001511 నంబరు డ్రైవింగ్ లైసెన్స్ ఉంది. మృతుడి గురించి తెలిసిన వారు పెద్దారవీడు పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ అనిల్‌కుమార్ 9121102186 లేదా హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు సెల్ 9908056611 నంబర్లను సంప్రదించాలని పోలీసులు సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

మాయమై పోతున్నడమ్మా.. మనిషన్న వాడు!

- మానవ సంబంధాలు కనుమరుగు
- అంతరిస్తున్న కుటుంబ వ్యవస్థ
- పేగు బంధాలకు తిలోదకాలు
- సొంత వారినే చంపుకుంటున్న వైనం
- నాలుగు నెలల్లో 4 కుటుంబ హత్యలు

క్షణికావేశం కుటుంబ వ్యవస్థను విచ్ఛిన్నం చేస్తోంది. కాస్త ఆలోచిస్తే సమస్యలన్నీ ఒక్కొక్కటిగా పరిష్కారమవుతాయన్న విచక్షణ మరిచి కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కలకాలం కలిసి ఉండాల్సిన దంపతులు ఒకరినొకరు చంపుకునే వరకు వెళ్తున్నారు. కుటుంబంలో అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు, ఇతర బంధువులు తమ పేగు బంధాలకు క్షణాల్లో తిలోదకాలు ఇచ్చేస్తున్నారు. ఒకరిపై ఒకరు అనుమానం పెంచుకుంటూ మమకారాలకు తూట్లు పొడుస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గం కంభం పోలీసు సర్కిల్ పరిధిలో నాలుగు నెలల వ్యవధిలో నాలుగు కుటుంబ హత్యలు గమనిస్తే ఆందోళన కలిగిస్తోంది. ఇక జిల్లా వ్యాప్తంగా పరిశీలిస్తే ఇలాంటి ఘటనలు చాలానే ఉన్నాయి.

కంభం: కుటుంబ వ్యవస్థ రోజురోజుకూ విచ్ఛిన్నమవుతోంది. బంధువుల మధ్య ఉండే ప్రేమలు, ఆప్యాయతలు తగ్గిపోతున్నాయి. మానవ సంబంధాలు మంటగలుస్తున్నాయి. చెడు వ్యసనాలతో పాటు మద్యానికి బానిసలు కావడంతో భార్యభర్తలు, తల్లిదండ్రులు, అన్నాదమ్ముళ్ల మధ్య చిన్న చిన్న విషయాలకు గొడవలు పెరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు అనుమానాలు పెంచుకొని చంపుకునే స్థాయికి వచ్చేసారు. పక్క ఇంట్లో గొడవలు జరుగుతున్నా కొట్టుకొని చావనీలే..అని చూస్తున్నారే తప్పా అపే ప్రయత్నం చేయడం లేదు. గడిచిన నాలుగు నెలల్లో కంభం సర్కిల్ పరిధిలో జరిగిన నాలుగు కుటుంబ హత్యలను చూస్తుంటే ఇవే విషయాలు తేటతెల్లమవుతున్నాయి. మొదటి కేసులో భార్యను భర్త హత్య చేయగా రెండో కేసులో కొడుకును తల్లి, మూడో కేసులో తండ్రి కొడుకును, నాలుగో కేసులో భార్య భర్తను హత్య చేశారు. ఈ సంఘటనలు చూస్తుంటే భవిష్యత్తులో ఇంకా ఎన్ని ఘోరాలు జరుగుతాయో అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

తండ్రి చేతిలో కొడుకు హతం

అర్ధవీడుకు చెందిన షేక్ ఖాసిం వలి మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవ పడే వాడు. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 8వ తేదీన మద్యం తాగిన ఖాసింవలి భార్యతో గొడవపడి ఆమెను చంపేయాలన్న ఉద్దేశంతో వంట గదిలోకి వెళ్లి ఓ కత్తిని అడ్డ పంచెలో పెట్టుకొని రావడాన్ని కుమారు షేక్ షాకీర్ (14) గమనించాడు. తన తల్లిని ఎక్కడ చంపేస్తాడోనని వారి గొడవ మధ్యలోకి వెళ్లాడు. కోపంతో ఉన్న తండ్రి కుమారుడి ఛాతిపై కత్తితో పొడవడంతో బాలుడు మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.


షాకీర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

భర్తను హత్య చేసిన భార్య

అర్ధవీడుకు చెందిన షేక్ వలి కంభం పంచాయతీ పరిధి సాధుమియా వీధిలో వివాహం చేసుకొని భార్య రిజ్వానాతో కలిసి కొంతకాలంగా కాప వీధిలో నివాసం ఉంటున్నాడు. అతను పెయింటింగ్ పనులకు వెళ్తుండగా భార్య రిజ్వాన స్వీట్ షాపులో పనికి వెళ్తోంది. మద్యానికి బానిసైన వలి భార్యపై అనుమానం పెంచుకొని తరుచూ గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 3వ తేదీన ఉదయం 6.30 గంటల సమయంలో మద్యం తాగి భార్యతో గొడవ పడ్డాడు. భార్య రిజ్వాన కండువాతో భర్త మెడకు బిగించి హత్య చేసింది. అనంతరం సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు ఆమె ప్రయత్నించినా పోలీసుల విచారణలో అది హత్యగా తేలడంతో ఆమెను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.


హత్యకు గురైన వలి


గొనె సంచిలో ఉన్న శరీర భాగాలను పరిశీలిస్తున్న డీఎస్పీ, (ఇన్‌సెట్లో) కదం శ్యాంప్రసాద్ (ఫైల్)

కొడుకుని చంపిన తల్లి

స్థానిక జయప్రకాశ్ వీధిలో నివాసం ఉంటున్న కదం శ్యాంప్రసాద్ చెడు వ్యసనాలకు బానిసై పనికి వెళ్లకుండా సంపాదన లేకుండా మద్యం తాగుతూ కుటుంబ సభ్యులను, బంధువులను ఇబ్బందులు పెట్టేవాడు. తన సమీప బంధువులైన మహిళలతో అసభ్యకరంగా ప్రవర్తించగా పెద్దల సమక్షంలో పంచాయతీ చేసి మందలించారు. ఫిబ్రవరి 8న తన తల్లితో అసభ్యంగా ప్రవర్తించిన నేపథ్యంలో అన్న సుబ్రహ్మణ్యం, తమ్ముడు కాశీరావు అతడిని మందలించి భయపెట్టారు. అతడి ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో సహనం కోల్పోయిన కుటుంబ సభ్యులు 13వ తేదీన తల్లి లక్ష్మీదేవి, అన్న సుబ్రహ్మణ్యం, తమ్ముడు కాశీరావులు శ్యాంప్రసాద్‌ను చంపేయాలని నిర్ణయించుకొని ఆటో డ్రైవర్ వల్లంశెట్టి మోహన్‌ను కలిసి అదేరోజు రాత్రి హత్య చేశారు. మృతదేహాన్ని ఏం చెయ్యాలో అర్థంగాక నలుగురు కలిసి గొడ్డలి, కత్తితో 8 ముక్కలుగా నరికి అందుబాటులో ఉన్న మూడు గోతాల్లో కుక్కి ఎవరూ లేని సమయంలో మోసుకొని వెళ్లి ఇంటికి సమీపంలో ఉన్న పంట కాల్వ వెంబడి పడేశారు. ఈ హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. కేసు నమోదు చేసిన పోలీసులు తల్లి, ఇద్దరు సోదరులతో పాటు హత్యకు సహకరించిన ఆటో డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

భార్యను హత్య చేసిన భర్త

కంభం పంచాయతీ పరిధిలోని సాదుమియా వీధిలో నివాసం ఉంటున్న అర్థవీటి నాగ అంజలి పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో ఆయాగా పని చేస్తుండగా భర్త లారీ డ్రైవర్ గా పనిచేస్తున్నాడు. వీరికి ముగ్గురు పిల్లలు. ముగ్గురికీ వివాహాలు జరిగాయి. ప్రైవేటు స్కూల్లో పని చేస్తున్న తన భార్య ఇతరులతో చనువుగా ఉంటోందని అనుమానం పెంచుకున్న భర్త జీర్ణించుకోలేకపోయాడు. ఆమెను హతమార్చాలని నిర్ణయించుకున్న అతను జనవరి 12వ తేదీ రాత్రి భోజనం చేసి పడుకున్న తర్వాత అర్ధరాత్రి సమయంలో దివాన్‌కాట్‌పై నిద్రిస్తుండగా ఓ పెద్ద సైజు కర్ర తీసుకొని ఆమె తలపై దాడి చేయడంతో బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు భర్తను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.


అంజలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

కనిగిరిలో ఒకేరోజు నలుగురు మృతి

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం
- ఆత్మహత్య చేసుకుని మరో ఇద్దరు మృతి

కనిగిరి రూరల్:

పట్టణ సమీపంలోని పొగాకు బోర్డు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ఇద్దరు మృతి చెందారు. మృతులు పి.పోలయ్య, హనోక్‌లది మండలంలోని పట్టాభిరామపురం. మండలంలోని కృష్ణాపురంలో కుటుంబ, ఆర్థిక సమస్యలతో యూ.పద్మనాభరెడ్డి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోగా భూతంవారిపల్లిలో కుటుంబ కలహాల నేపథ్యంలో గుండాబత్తుని సుజాత (22) పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కనిగిరిలో ఒకే రోజు నలుగురు మృతి చెందడంతో ఆయా ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసుల కథనం ప్రకారం.. పట్టాభిరామపురం ఎస్సీ కాలనీకి చెందిన పాలిపోగు పోలయ్య (28), అదే కాలనీకి చెందిన మర్రి హనోక్ (24)లు బైకుపై పట్టణానికి వచ్చి తిరిగి వెళ్తున్నారు. మార్గంమధ్యలో టుబాకో బోర్డు సమీపంలో పొదిలి రోడ్డు వైపు నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. పోలయ్య తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా హనోక్‌కు తీవ్ర గాయాలు కావడంతో కనిగిరి ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు తీసుకెళ్తుండగా మృతి చెందాడు. పోలయ్య బేల్దారి పనులు చేసుకుని జీవిస్తుండగా హనోక్ డిగ్రీ వరకు చదివి కూలి పనులకు వెళ్తున్నాడు. మృతులు బంధువులు.


రోడ్డు ప్రమాదం జరిగింది ఇక్కడే..

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య

మండలంలోని కృష్ణాపురంలో యూ.పద్మానాభరెడ్డి (45) తన ఇంటికి సమీపంలోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ, ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన మండలంలోని భూతంవారిపల్లిలో శనివారం జరిగింది. సీఎస్‌పురానికి చెందిన జి.సుజాత (22)కు కనిగిరి మండలం భూతంవారిపల్లికి చెందిన అశోక్‌కు మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి రెండేళ్ల బాబు ఉన్నాడు. కొంతకాలంగా దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. శనివారం రాత్రి 100 కాల్ చేసి మరీ.. తాను పురుగుమందు తాగి చనిపోతున్నట్లు తెలిపి ఆత్మహత్యకు పాల్పడింది. సుజాతను స్థానిక వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.


పద్మనాభరెడ్డి మృతదేహం వద్ద ఏఎస్సై


సుజాత మృతదేహం

సరైన సాక్ష్యాలతోనే నిందితులకు శిక్ష

- ఎస్పీ ఏఆర్ దామోదర్

ఒంగోలు టౌన్: ఎట్టి పరిస్థితితుల్లోనూ నిందితులకు శిక్ష పడాల్సిందేనని, అప్పుడే నేరాలు తగ్గుముఖం పడతాయని, సరైన సాక్ష్యాల సేకరణతోనే నిందితులకు శిక్షలు పడతాయని ఎస్పీ ఏఆర్ దామోదర్ అన్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులకు ఫోరెన్సిక్ ఎవిడెన్స్ మేనేజ్‌మెంట్‌పై ఒక రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన ఎస్పీ మాట్లాడుతూ నేరస్తుడు వదిలి పెట్టిన భౌతిక సాక్ష్యాధారాలను సశాస్త్రీయంగా సేకరించినప్పుడే నేరాన్ని రుజువు చేసి శిక్షలు పడేలా చేయడం సాధ్యమవుతుందన్నారు. సాక్ష్యాలను సేకరించే విషయంలో పోలీసు అధికారులు నైపుణ్యం కలిగి ఉండాలని సూచించారు. రోజూ పోలీసు స్టేషన్లలో నమోదయ్యే కేసుల్లో పోలీసు అధికారులకు సవాళ్లు ఎదురవుతూనే ఉంటాయని చెప్పారు. నేరం జరిగిన తీరుతెన్నుల ఆధారంగా కొన్ని కేసులు సులువుగా ఛేదించగలిగితే మరికొన్ని కేసులను ఛేదించడం క్లిష్టతరంగా ఉంటాయని వివరించారు. నేరానికి దారి తీసిన పరిస్థితులను సమగ్రంగా తెలుసుకునే విషయంలో నిష్ణాతులు కావాలని చెప్పారు. సకాలంలో సాక్ష్యాలను సేకరించడం, వాటిని తగిన జాగ్రత్తల్లో ప్యాకింగ్ చేయడం, వీలైనంత త్వరగా వాటిని ఫోరెన్సిక్ ల్యాబరేటరీకి పంపించడం చాలా అవసరమన్నారు. సాక్ష్యాల సేకరణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. పోలీసు అధికారులంతా నైపుణ్యం కలిగి ఉండాలని, శిక్షణలో నిపుణులు ఇచ్చే సూచనలు, సలహాలు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. శిక్షణ తరగతుల్లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె. నాగేశ్వరరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, సాయి ఈశ్వర్ యశ్వంత్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్పీ దామోదర్

జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం

- వై.పాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్
- ఘనంగా కనిగిరి ఇన్‌చార్జి దద్దాల జన్మదిన వేడుకలు

కనిగిరి రూరల్: జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయమని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. శనివారం కనిగిరి వచ్చిన ఆయన స్థానిక వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్‌తో కలిసి మాట్లాడారు. దద్దాల నారాయణకు జగనన్న అండగా ఉన్నారని, పార్టీ శ్రేణులంతా సమష్టిగా, కష్టపడి పనిచేసి కనిగిరి కంచుకోటపై వైఎస్సార్ జెండా ఎగుర వేయాలని పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కూడా జిల్లాలో తక్కువ ఓట్లతో కనిగిరి ఓడిపోయామన్నారు. మంచివాడు, మృదుస్వభావి, అందరిలో ఒక్కడిగా ఉంటూ అందరినీ కలుపుకుని పోతున్న దద్దాల నారాయణకు పార్టీ శ్రేణులంతా అండగా ఉండాలన్నారు. 2029 ఎన్నికల్లో కనిగిరిలో వైఎస్సార్ సీపీ దెబ్బకొడితే దిమ్మతిరిగిపోవాలన్నారు. రాబోయే రోజులు వైఎస్సార్ సీపీవేనని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని పిలుపు ఇచ్చారు. పార్టీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ మూడేళ్ల తర్వాత జరిగే ఎన్నికల్లో మనమంతా కలిసి కట్టుకకు పనిచేసి జగనన్న సీఎం చేసుకుందామన్నారు. కష్టపడి పనిచేద్దాం.. ఇదే ఉత్సాహంతో కనిగిరి కొండపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురు వేద్దామని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతుందోని ధ్వజమెత్తారు. 11 నెలల పాలనలోనే కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఈసడించుకుంటున్నారన్నారు. కూటమి సర్కార్ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని ఘాటుగా విమర్శించారు. తొలుత ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, కనిగిరి పార్టీ ఇన్‌చార్జి దద్దాల నారాయణ యాదవ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్నారు. నారాయణకు పుష్పగుచ్ఛం అందజేసి కేక్ తినిపించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నారాయణ యాదవ్, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, పక్కన దద్దాల నారాయణ యాదవ్

వెరిటాస్ సైనిక్ స్కూల్‌కు భారత ప్రభుత్వం అనుమతి

- దేశ రక్షణకు విద్యార్థులను తయారు చేయడమే వెరిటాస్ లక్ష్యం
- వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుపతిలో 22 ఏళ్లుగా బీఎస్‌ఆర్ విద్యాసంస్థల ద్వారా క్రమశిక్షణతో కూడి విద్యతో పాటు వేలాది మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూ ఇటు విద్యార్థుల ఉన్నతికి, దేశ రక్షణకు అందిస్తున్న సేవలను గుర్తించి భారత ప్రభుత్వం మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ సైనిక్ స్కూల్ అనుమతి పొందినట్లు వెరిటాస్ సైనిక్ స్కూల్ చైర్మన్ డాక్టర్ బి.శేషారెడ్డి తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ విద్యాసంస్థల ద్వారా ఇప్పటికే సుమారు 20 వేల మంది విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యను అందించడంతో పాటు 6 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని తెలిపారు. అందరి సహకారంతో భారత రక్షణ దళానికి ఎంతో మంది సైనికులను అందించేలా కృషి చేశామన్నారు. వెరిటాస్ సైనిక్ స్కూల్ స్థాపించినప్పటి నుంచి అనుభజ్ఞులైన వారితో అత్యుత్తమమైన విద్యాప్రమాణాలతో విద్యార్థులకు విద్యతో పాటు శారీరక మానసిక, మానవీయ విలువలతో కూడిన విద్యను అందిస్తూ ఆదరణ పొందామన్నారు. భారత ప్రభుత్వం గుర్తింపుతో మరింత బాధ్యతగా దేశ భద్రత కోసం వెరిటాస్ సైనిక్ స్కూల్ ముందడుగు వేస్తోందన్నారు. ఉన్నత అధికారులుగా విద్యార్థులను ఎదిగేందుకు అవసరమైన ఉన్నత ప్రమాణాల విద్యను అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. రాబోవు కాలంలో ప్రభుత్వ సైనిక్ స్కూలు అనుసంధానంతో కరికులం, యాక్టివిటీస్, కాంపిటీషన్స్ వంటి అన్ని సైనిక్ స్కూల్ సొసైటీ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశానికి అవసరమైన విద్యను యువతకు డిఫెన్స్ రంగాల్లో ఎన్‌డీఏ, టీఈఎస వంటి ఉత్తమ ఉద్యోగ అవకాశాలను కేవలం 17 ఏళ్ల వయసులోనే పొందే విధంగా తీర్చిదిద్దాలని సంకల్పించామన్నారు. వెరిటాస్ స్కూల్లో చదువుకున్న ప్రతి విద్యార్థి దేశంపై, సమాజంపై బాధ్యతగా ఉండేలా తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇకపై ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ పరీక్షల ద్వారా కౌన్సిలింగ్ నిర్వహించి సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. విద్యాసంస్థలో ప్లస్–1 ఇంటర్మీడియెట్‌తో స్పెషల్ ఎన్‌డీఏను ప్రారంభిస్తున్నామని, ఈ అవకాశాన్ని ఆసక్తి ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 22 ఏళ్లుగా తమకు సంస్థ అభివృద్ధికి సహకరించిన విద్యార్థులు, తల్లిదండ్రులకు, అధ్యాపకులు, అధ్యాపకేతురులకు ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో వెరిటాస్ సైనిక్ స్కూల్ డైరెక్టర్లు బి.శ్రీకర్‌రెడ్డి, బి.సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి